# ★ ★ ★ మృత్యువు

శ్రీ. టి. రామశాస్త్రి

తుపాను తీవ్రత, గాలిహోరు, వానఒత్తిడి తగ్గ నారంభించాయి. బరువుగా అలసి నీరసంతో ఒడ్డుచేరుకుంటున్నాయి ఎత్తైన సముద్రపు నీలికెఱటాలు. క్రమంగా గాలివాన తగ్గి దట్టంగా నల్లగానున్న మేఘాలు విడిపోతూ అప్పుడప్పుడు చంద్రుడు గోచరమవుతున్నాడు. ఆ కాంతికి ఒడ్డుకు యించుమించు ఆరు మైళ్ళ దూరములో నున్న నౌక నల్లని పొగవిడుస్తూ ఒరుగుతూ లేస్తూ కనిపించి మాయమవుతోంది శబ్దంలేని మెరుపుల సహాయంతో.

ఆ ఓడ శక్తికిమించిన జనంతో, వారి మాటలతో, అధికార్ల కేకలతో, చిన్నపిల్లల యేడ్పులతో చూడ సుందరమయిన దృశ్యంగా మారింది. 'డెక్కు' మీద నిలబడి చుట్టూపరికిస్తున్న కెప్టన్‌ను మాటికి మాటికి ప్రశ్నలువేస్తున్న ప్రయాణీకుల్ని చూస్తే వారి ఆతురత హెచ్చయినట్లు కనిపిస్తుంది. రంగూనునుంచి యుద్ధభయంతో వస్తున్న ప్రజను హిందూదేశంలో దిగబెడుతోందా ఓడ. గత కొద్ది దినాల్నుంచి అనేకకష్టముల పాలయిన ప్రజకి త్వరగా గట్టుచేరడానికి ఆతురతగా వున్నది.

'ఇంకా ఒడ్డుచేరడం క్షేమకరంకాదా' అని అడిగి లేదని తెలుసుకొని నిరాశతో వెళ్ళిపోతున్న ప్రయాణీకులవలన కొంతకాలం గడిచింది. ఆకాశం నిర్మలమయింది. సముద్రం అలసిపోయింది. నీటిలోని తూర్పు ఆకాశాన్ని తెల్లబరుస్తోంది. తప్పుచేసినవాడివలె తెల్లముఖం వేశాడు చంద్రుడు. వేగుజుక్క గర్వంగా విజయం చాటుతోంది. అక్కడక్కడ యెగురుతున్న దూది పింజల్లాంటి మేఘపుచీలికల్ని తన కనుగుణ్యంగా మారుస్తూ రక్తవర్ణం వదిలి వెండిగుండా బంగారుచ్ఛాయలోకి మారింది తూర్పు. మరికొంతసేపటితో సూర్యోదయం అలసిపోయిన ప్రకృతిని నూతన వికాసంతో నింపింది. గతాన్ని మరిపిస్తూ చల్లగాలి వీస్తోంది.

సూర్యోదయం, ఒడ్డుకు ప్రయాణీకుల్ని చేర్చడానికి కెప్టన్ అనుమతి, ప్రమాదం తప్పిందన్న ఉత్సాహం. ప్రయాణీకులకు కొత్తజీవం పోశాయి. బయలుదేరుతున్న చిన్నస్టీమరుతో అంతా ఒక్కసారిగా వెళ్ళాలని చిన్నయుద్ధం చేశారు. అతి కొద్దిమందితో వెళ్తున్న స్టీమర్ని చూచి ఓపిక నిలుపుకోలేక ఓడమీద చుక్కానిలేక శిథిలావస్థలోనున్న చిన్నపడవను తీసుకొని కొందరు నీట దుమికారు. నడపడానికి తెడ్డుకూడా లేక, అలల సహాయంతో వెళ్తూ చేరవలసిన గమ్యస్థానానికి దూరంగా వెళ్తున్నపడవను, దానిపోకడ బట్టి భయంతో దానిలో కూర్చున్నవారి అమాకత్వానికి, తొందరకి సానుభూతి చూపుతూ చిరునవ్వులర్పించాడు కెప్టన్.

మరి గంటలో ఒడ్డుచేరుకున్నదా చిన్నపడవ. మొదట నిండుగానున్న పడవ యెండుచేతనో నిర్మానుషంగా కనిపిస్తూ మరి నిముషంలో కుటుంబం ఖాళీపడవలోంచి కనిపించింది. ఆ ప్రదేశాన్ని, పరిసరాల్ని ఒక్కసారిగా కలయచూచారు.

భర్త బలమయిన వ్యక్తయినా ముదుసలి రూపునకు మారాడు. సగం పెరిగినగడ్డం, సంరక్షణ లేక మాసిపోయినబట్టా, సరియైన ఆహారం లేక కృశించినదేహం, కట్టుకుందుకు కూడా పూర్తిగా లేని బట్టగల అతన్ని లొంగదీసి మార్చివేశాయి.

ఆభరణాలు లేకపోయినా సహజసౌందర్యము కలిగిన భార్య యీ పరిస్థితులలో అవ్వగారయింది. పాలు లేకపోయినా త్రాగడానికి ప్రయత్నిస్తున్న బిడ్డను కుడుపుతూ ఆతృతతో ఆహారం కోసం భర్తకేసిచూస్తూ నిల్చుంది.

పరిసరాలు పరికిస్తూ వీరికిముందు కొద్ది దూరంలో కూలబడింది మాత. ముడతలు పడిన లేతబంగారుచ్ఛాయగల దేహంతో, సూర్యకాంతి పడినిగ నిగ మెరిసే నెరసిన జుత్తుకలిగి, ఆశతో విద్యుద్దీపాలవలె మెరుస్తున్న కళ్ళతో ప్రకృతి గాలిస్తోందిమాత—భర్తతల్లి.

అందరివద్ద చింకి గుడ్డలు చిన్న గిన్నెలు ఉన్నాయి. పడవదిగి చుట్టూచూసి.

"ఏంచేద్దాం?" అన్నట్లు భార్య భర్తను చూచింది.

"ఏంచేయ్యను?" అంటూ భర్తకళ్ళు నిరాశ వెలిబుచ్చాయి.

"మరి నాగతి?" అని గొణిగింది మాత.

బిడ్డ పాలకు యత్నిస్తూ చంకలో నిలవడం లేదు.

సన్నని యెండచురుకు చిన్నగా తగులగానే కుటుంబం ప్రయాణం సాగించింది అదీ అంతూలేని యిసకమైదానంలో. గంట నడిచిన తరువాత దారితెలియక ఆగి ఆలోచనకు దిగిన భర్తకు దూరంగా వెళ్తున్న జాలరి కనిపించగానే ఉత్సాహంతో లేనిశక్తి తెచ్చుకొని సమీపించి.

"అయ్యా ఊరులోకి తోవచెపుతారా?" వినయంగా ప్రాధేయపడ్డాడు.

భుజాన వేసుకున్న తెడ్లచివర చేపలబుట్ట, నీళ్ళుతిత్తి వేలాడుతూ అరంగుళాల చుట్ట ఆలోచనగా కాలుస్తూ. పల్లెవదాల కూనిరాగానికి లయగా చెప్పులు ధ్వనిచేస్తూ వెళ్తున్న జాలరి చటక్కున ఆగి నోట్లోంచి చుట్టతీస్తూ ఆశ్చర్యంతో.

"ఏమిటన్నారు?" అని అడిగాడు.

"ఊళ్ళోకి తోవచెపుతారా?"

"మీదేవూరు?" సావకాశంగా ప్రశ్నించాడు జాలరి పాగాగుడ్డదులిపి మళ్ళా కట్టుకుంటూ.

మాది రంగూను బాబూ. ఈమధ్య బాంబులు పడి వచ్చేశాం. దారిలో చాలాకష్టాలు పడ్డాము, ఓడలో తిన్నగా తిండీ యేమీ దొరకలేదు. ఇవాళ యిక్కడికిచేరాము. దారితెలియడంలేదు" దీనంగా క్లుప్తంగా తన చరిత్రతెలిపాడు భర్త.

"కొత్తగనకనే యిలా వచ్చారు. మీరు తప్పు తోవలో పడ్డారు. ఇప్పుడయినా ఫరవాలేదు. ఈ దారినపోతే మరి ఫర్లాంగులో ఒకవూరుంది. ఆ ఊరు...." అని జాలరి వివరాలు చెపుతుండగానే దూరంగా, భార్యపిలుపు వినిపించింది భర్తకు. వెంటనే కృతజ్ఞతతెలిపి భర్త భార్యవద్దకు వెళ్ళాడు, వారినిచూస్తూ కొంతసేపు ఆగి తిరిగి నడకసాగించాడు జాలరి.

"కంగారుగా పిలిచావేం?" అని ఆందోళన పడుతున్న భార్యను ప్రశ్నించాడు భర్త సమీపిస్తూ.

"మరేంలేదు. అత్తకి కొంచం కళ్ళు తిరిగాయి. భయంవేసి పిలిచాను. మనం చప్పున యెక్కడికేనా వెళ్ళిపోవాలి" అన్నది భార్య తన భయకారణం తెలియబరుస్తూ.

"ఇక్కడికి దగ్గిరలోనేవుందిలే వూరు. మనకి తిండిదొరుకుతుంది పద" అంటూ భార్యా తనూ తల్లిని చెరోచేత్తో నడిపించుకొని పోసాగారు నెమ్మదిగా.

క్రమంగా పదిగంటలు కావచ్చింది. దూరంగా ఫాక్టరీగొట్టాలు, వాట్లోంచిపొగ, మేడలు కనపడుతున్నాయి. వెనక్కుతిరిగిచూస్తే జాలరి, సముద్రంతప్ప మరెవరూలేరు. ఆశతో అడుగులువేస్తూ వస్తున్నారు కుటుంబం.

'అబ్బా' అంటూ పట్టుతప్పి నేలకొరిగింది మాత. గప్పున పడిపోకుండా పట్టుకొని మెల్లగా సమీపాన్నవున్న చిన్నచెట్టుక్రిందకు తీసుకెళ్ళి చేయగలిగిన ఉపచారాలు చేశారు. చుట్టుప్రక్కల యెవరయినావుంటే సహాయం చేస్తారని గట్టిగా గొంతెత్తిపిలిచాడు భర్త. లాభంలేక వచ్చి తల్లిని చూచి భయంకలిగి ఆందోళనలో పడ్డాడు. నీటికోసం గిన్నెపట్టుకొని జాలరిపోయినదిక్కు అతన్నిపిలుస్తూ కొంతవరకువెళ్ళి కలుసుగోలేనని నిరాశచెంది వెనక్కుతిరిగాడు. సముద్రం కనిపిస్తూ అవసరానికి నీరులేకపోవడం దుఃఖం కలిగింది. ఆ ఉప్పునీరే తెద్దామని వెళ్ళబోయి కంగారు తొందరల మధ్య యేమీ పాలుపోక చెదరిపోయిన మనస్సుతో యిటు అటు తిరిగి ఉత్తచేతులతో తల్లివద్ద నిలిచాడు.

అంతా నిశ్శబ్దం ఆవరించింది. దూరాన మాలకాకి విచారంగా అరుస్తోంది. గద్దలు ఆకాశాన ఎత్తుగా చక్రాలుగా ఉత్సాహంతో తిరుగుతున్నాయి. నల్లనిమబ్బు సూర్యునికి అడ్డువచ్చింది. జాలిగా ఆత్రుతతో తనవేపుచూస్తున్న అత్తుల్నయినా కనికరించక శాశ్వతంగా మబ్బునీడలో యీలోకం విడచింది మాత.

'అమ్మా' అంటూ మీదపడి మిక్కిలి రోదించాడు భర్త. చనిపోయి కొద్దినిముషాలే అయినా యెన్నోయేళ్ళు గడిచినట్లు తోచింది భర్తకు. మనసార పూర్తిగా యేడువలేకపోయాడు. తన అప్పటి పరిస్థితులు, కుటుంబాన్నిచూచి దుఃఖం దిగమింగవలసివచ్చింది. మబ్బువిడి మాలకాకి యెగసిపోయింది.

మాతకి సంస్కారానికికూడా అశక్తుడైనాడు భర్త. పదిలంగా తన పైగుడ్డకప్పి ప్రకృతికి తన తల్లినివదలి రక్షించమని దేవుణ్ణి ప్రార్థిస్తూ వెనక్కితిరిగిచూస్తూ వెళ్ళలేక వెళ్ళలేక కుటుంబంతో సాగిపోయినాడు భర్త.

పెద్దపట్నం ప్రవేశించారా కుటుంబం. ఎండ తీక్షణానికి పైన తల, క్రింద కాళ్ళు కాలడం మొదలుపెట్టాయి.

విచారవదనాలతో, నెమ్మదిగా అడుగులువేస్తూ మోటార్లను, హోటళ్ళను, మనుష్యులను రకరకాల చిత్రాలు ఆశ్చర్యంతో చూస్తూ, అచ్చటి సౌభాగ్యాలకి ఆశ్చర్యపోతూ అంతటి ప్రదేశంలో తమకు జీవనాధారం దొరకకపోదనే ధైర్యంతో తాము యెరిగిన వ్యక్తెవరయినా కనిపిస్తాడేమోనని ఒళ్ళంతా కళ్ళుచేసుకొని చూస్తూ ప్రవేశించారు కుటుంబం. వారిదృష్టి నాకర్షించిందో చెరువు. బహుశః యెండవేడికి కాబోలు గట్టునవేయబడ్డ పాకల్లో ఒకరిద్దరు తప్ప యింకెవరూలేరు. చెరువునంటేవుంది విశాలమైన రోడ్డు ట్రాఫిక్‌కుతావిస్తూ.

కుటుంబం చెరువుగట్టునచేరారు. బిడ్డను నీడలోపడుకోబెట్టి నీటివద్దకువెళ్ళి ముఖాలు కడుగుకొని తృప్తితీరా నీరుత్రాగి బిడ్డకుకూడా పట్టి ప్రాణాలు కుదుటబడి కూర్చున్నారు.

"అమ్మకు సమయానికి నీరులేకపోయింది" అన్నాడు భర్త ఆలోచిస్తూ. కంటివెంట నీరు గిర్రునతిరిగింది. కొంతసేపటివరకు వారికే అర్థంకాని ఆలోచనలతో మౌనంలో మునిగిపోయారు. గాలి వెచ్చగా వీస్తోంది. గాలిలో వేగంగా ప్రయాణంచేస్తున్న మేఘాలవల్ల యెండ అంత తీక్షణంగాలేదు. దూరంగా ఉరుముల శబ్దం వినిపిస్తోంది.

"నేను యెక్కడేనా ప్రయత్నంచేసి యిప్పటిమటుకు మనకి తిండితెస్తాను. ఈ భోజనాలవేళ అంతమాత్రం దొరకకపోదులే. నువ్వుమాత్రం జాగ్రత్తగా పాపను చూస్తూండు. దొరికితే పాపకు పాలుకూడా తెస్తా"నంటూ గిన్నెలు తీసుకొని వెళ్ళిపోయినాడు భర్త.

భర్త చూపుమేర దాటిపోయేదాకా చూసి వచ్చి కూర్చుంది భార్య, అత్తగారు లేకపోవడం తడుముకున్నట్లు ఒంటరిగా కనిపించింది. బిడ్డను ఒడిలో వేసికొని రోడ్డుమీద వచ్చేపోయేవారిని తిలకిస్తూ ఆలోచనలోపడి కాలం మర్చిపోయింది.

వెనకరోజులు గుర్తుకువచ్చాయి. హఠాత్తుగా బాంబులవర్షం. భయపడి హిందూదేశానికి రావడానికిపడ్డ శ్రమదమాలు, ఓడలోకలిగిన చిక్కులు అన్నీ తలపుకువచ్చాయి.

ఇంతలో బిడ్డ యేడుపు ప్రారంభించింది. నీళ్ళుపట్టి నిద్రపుచ్చుతూ మళ్ళీ ఆలోచనలో పడింది.

దారిన వెళ్తున్న గొప్ప శ్రీమంతులను, వారి సౌభాగ్యాలను తల్చుకుంటే ఒక విధమయిన 'జెలసీ' అంకురించింది. తనుకూడా అట్టి అదృష్టం పొందగూడదా అనిపించింది.

భర్తవెళ్ళిన దిక్కుచూచి యింకా రాలేదని తెలుసుకొని ఆతురతతో చూస్తోంది. గాలి చలనం లేక నిలిచిపోయింది.

"భర్త ఆహారం తెస్తాడు. అంతమాత్రం ఆ మహాపట్నంలో ఆహారం దొరకకపోదు. తరువాత యెలాగో నౌకరీ దొరుకుతుంది. హిందూదేశంలో కూలిచేసినా లక్షలు సంపాదించవచ్చునట. అప్పుడు బీదవాళ్ళకు సహాయంచేస్తాను. ఆఊళ్ళో నేవుంటే మంచిలాభం. వింతలన్నీ చూడవచ్చు. పరిస్థితులు అనుకూలంగావుంటే రంగూను చప్పునపోయి యిళ్ళువాకిలి చూచుకోవచ్చు. పాపం తిరుగుప్రయాణంలో అత్త వుండదు. ముఖ్యంగా డబ్బు బాగా ఆర్జించి యిక్కడి గొప్పవారికంటే గొప్పగా వుండవచ్చు. ఆసమయంలో పాపయిలాగ...."

పాప తిరిగి ఆకలివల్ల యేడుపు ప్రారంభించింది. ఈసారి పాపను ఊరుకోబెట్టడానికి భార్య చాలా శ్రమపడుతుండగా పదహారేళ్ళబాలిక వచ్చి జాలిగాచూస్తూ అత్త పురమాయింపువల్ల నీళ్ళు తేవడానికి వచ్చానన్న సంగతి మరచి నిల్చుండిపోయింది.

"యెందుకండీ పాప యేడుస్తున్నది?" అని వినయంతో అడిగింది బాలిక.

"పాలులేవు....ఆకలి" అంతకుమించి మరి ఆపరిస్థితిలో చెప్పలేకపోయింది భార్య.

"పాలు తెస్తానుండండి" అంటూ బిందెదింపి పరుగున ఎదురింట్లోకి వెళ్ళిందా బాలిక.

ఆశతో ఒక్కసారిగా కళ్ళు పెద్దవిగా చేసి మాటకుకూడా సందివ్వకుండా వెళ్తున్న బాలికను చూచి మళ్ళా పాపవైపు తిరిగింది భార్య.

"అప్పుడే వచ్చావేం?" అని విసురుగా అడిగింద త్తగారు హడావడిగా వచ్చిన కోడల్ని చూసి.

"పాపం....యెవరోఅత్తా--పాపకి పాలులేవు. చెరువు దగ్గిర యేడుస్తున్నాది"

"అయితే" అర్థంలేని ప్రశ్న వేసింద త్త.

"ఆవుపాలున్నాయి కదా. కొంచెం....యిద్దామని...."

"నీజాలి చూస్తే నవ్వొస్తోంది. జాలుంటే ఉందికాని అన్నీ యిచ్చేసుకుంటూరా పిచ్చిదానా ఇలాఅయితే...."

యింకా యేమోఅనబోయి ఖిన్నురాలయిన కోడల్నిచూచి అంతలోనే దయకలిగి,

"సరే తీసుకెళ్లు. బిందె అక్కడేవదిలావా. ఈ పాటికి పోయుంటుంది...."

తక్కిన సంభాషణ వినకుండానే చిన్నగిన్నెలో పాలు తీసుకెళ్ళింది పాపకు బాలిక.

బిడ్డ యేడవక సొమ్మసిల్లడం చూచి

స్పృహ తప్పినట్లుగా వుందండి చప్పున పాలు పొయ్యండి అంటూ దగ్గరగా వచ్చికూర్చుంది.

బిడ్డ సొమ్మసిల్లడంచూచి ఆందోళనపడుతున్న భార్య యీమాటలను వినిపించుకోలేదు. ఎన్నడు లేనిభయం, అంధకారం, ఆవరించాయి హృదయాన్ని. పెద్దభూతమేదో దగ్గరగావచ్చి మీద పడబోతున్నట్లనిపించింది, ఒక్కొక్కసారి గుండె ఆగిపోతున్నట్లనిపించింది. ఏదో చేతిలోనుంచి జారిపోతున్నట్లు దానిని తను ఆపడానికి విశ్వప్రయత్నంచేస్తున్నట్లు తోచింది.

శూన్యహృదయంతో బిడ్డకేసిచూస్తున్న భార్య తలెత్తిచూసి గిన్నె అందుకోని,

"ఈ అమ్మ యెవరో పుణ్యాత్మురాలు. నా తల్లికి సమయానికి పాలుయిచ్చారు. మిమ్మల్ని వెయ్యేళ్ళు దేవుడు రక్షించాలి. చిట్టితల్లీ పాలు తాగుదువుగాని" అంటూ పాపవైపు తిరిగి కన్నీళ్ళు కారడంచూచి.

నాచిట్టితల్లికి కళ్ళవెంబడి నీళ్ళుకారుతున్నాయి. సమయానికి పాలు యివ్వలేని పాపిష్టి అమ్మ యెందుకు అంటూ కన్నీళ్ళు తుడుస్తూ పాప చైతన్యాన్ని తప్పివుండడంచూచి పాలగిన్నె నేల జారవిడిచింది. తను యెంత ఆపుకుందామని ప్రయత్నించినా కన్నీళ్ళు ధారాపాతంగా కారడం మొదలుపెట్టాయి. ఒళ్ళు తడిమిచూచి వేడిగా వుండడంచేత పాపకి హానిలేదని ధైర్యం తెచ్చుకుంది.

ఆలోచన పాలుపోక కొంతసేపటికి పాపకు ఉచ్ఛ్వాసనిశ్వాసలు లేకపోవడంచూచి చనిపోయిందని నిశ్చయించుకున్నది. మాటిమాటికి బిడ్డను రొమ్ముకద్దుకుంటూ మిక్కిలిగా రోదించసాగింది. దారినపోయే ప్రతీవారు కన్నీరుకార్చారు. బిడ్డమాత్రం నవ్వుముఖంతో శాశ్వతనిద్రపోతోంది. ఏడ్చి యేడ్చి భార్య తెలివితప్పింది.

సాయంత్రం కాజొచ్చింది. మేఘాలవల్ల పూర్తిగా చీకటి యేర్పడింది, మెరుపులు ఉరుములు మాటిమాటికి వినవస్తున్నాయి. రయ్‌మని వీస్తున్న వేడిగాలికి నెమ్మదిగా ఆకలములు యెగురుతున్నాయి. మళ్ళీ తుపాను సూచనలు కనిపిస్తున్నాయి.

జుట్టువిడిపోయి, చిరిగిపోయిన పమిట తొలిగి, బిడ్డను రెండుచేతులతో రొమ్మున కదుముకుంటూ, వెఱ్ఱినవ్వు నవ్వుతున్న భార్యనిచూసి అర్థంకాక అంతా విచిత్రంగా చూడసాగారు. ఆగాలి దుమారంలో ఆవిధంగా వెళ్తున్న భార్యకు సందు చివర భర్త కనిపించాడు.

ఉదయంనుండి తిరిగి తిరిగి నలుగురన్న నాలుగుమాటలు సహించి యెన్నడు బిచ్చమెత్తని నోటితో బిచ్చమెత్తి చివరకు దెబ్బలకుకూడా సహించి భార్యాబిడ్డల నిమిత్తం అన్నం తెస్తున్నాడు భర్త. అదృష్టవశాత్తు పాలుకూడా దొరికాయి. మనస్సు సంతోషంతో ఉప్పొంగిపోతూ కలలుగంటూవస్తున్న భర్తకు భార్యా బిడ్డను యెందుకు అలా చూస్తున్నారో అర్థం కాలేదు.

"గాలిదుమారం లేస్తోంది. ఏదేనా పంచ కిందకు వెళ్ళు పాపకి హానికలుగుతుంది," అని దూరాన్నుంచే హెచ్చరిస్తూ వస్తున్నాడు.

కాని దట్టంగా లేస్తున్నదుమ్మును లక్ష్యపెట్టక యేమేమో చెప్తూవస్తున్నాడు.

ఉదయంనుంచి కష్టపడి వస్తున్న భర్త వేరే ఆలోచనలోమునిగాడు. భార్యా బిడ్డలకు అంతకాలం బాధకలిగించినందుకు తనలో తాను తిట్టుకున్నాడు.

"పాప జాగ్రత్త....జాగ్రత్త....పాలు దొరికాయి, తెచ్చాను, అని చెప్తుండగానే.

వెనకనుంచి హారన్‌కొడుతూ పెద్దకారువచ్చి భార్యబిడ్డల్ని భూస్థాపితంచేసి మరి పదిగజాల దూరంలో ఆగింది.

ఒక్కసారిగా జరిగినదాన్ని నమ్మలేకపోయాడు భర్త, చేతుల్లోంచి అప్రయత్నంగా గిన్నె జారిపోయింది. కింద భూమితిరిగిపోతున్నట్లు కనిపించింది. ఎర్రనిరక్తంలో, ఆ తుపానులో భూమిమీదఉన్న ఆయిద్దర్నీ చూస్తే మతిపోయిందతనికి. ఏంచేస్తున్నది తనకే తెలియలేదు.

ఆవేశం కొద్దీ, కోపంతో కారు యజమాన్ని దెబ్బవెయ్యడానికి చెయ్యెత్తి లేనిశక్తి తెచ్చుకొని వస్తూ యింకా కొద్ది అడుగులు వెయ్యకుండానే పడి గుండెలు పగిలి చనిపోయినాడు భర్త.

తలవనితలంపుగా జరిగినదానికి వస్తూ దగ్గరలో ఉన్న కాన్‌స్టబులుకు రిపోర్టుచేసి వస్తున్న కారు యజమాని భర్తనుచూచి నిర్ఘాంతపోయాడు,

గాలిదుమ్ము తగ్గాయి. వాన హెచ్చింది. హోరునపడుతూ కుటుంబానికి శాశ్వతసుఖం ప్రసాదిస్తోంది వాన.

భార్య దుఃఖంతో, భర్త కోపంతో, పాప చిరునవ్వుతోకూడిన ఆకలితో దూరంగా....మాతచలితో హోరుమని ధ్వనిచేస్తున్న సముద్రం వైపుమాస్తూ రంగూను కలలుకంటున్నారు నిర్మలమయిన నీటిలో స్నానంచేస్తూ.

